వ. రా : మరి నిలబెట్టకు నీకథ ! ఇంద—(డబ్బు తీస్తూవుంటాడు)

అ. వై : రెండు తలనొప్పి మాత్రలు తెప్పిద్దురూ—

చంద్రి : అవునండీ — కొంచెం వేడి కాఫీకూడా తెప్పించండి. అబ్బబ్బ...

వ. రా : (అట్లాగే వుండిపోయి చూసి, తేరుకుని) వూఁ—గోపాలం గారూ, మీకేమిటి ?

అ. గో : ప్రత్యేకంగా నాకేమిటి ? నాకూ అకాఫీయే తెప్పించండి.

వ. రా : కవిగారూ—(మీకేమిటన్నట్లు (చూస్తాడు)

అ. రా : నాకొంవొద్దు సుమండీ. వొంట్లో ఏం బాగులేదు.

అ. గో : కాఫీ తాగటానికేం ? కొంచెం కాఫీతాగండి.

అ. రా : తాగటానికేం లేదులెండి; కాదు — కొద్దిగా అకలవు తున్నట్టుంది...ఒఖ దోసో రెండు బజ్జీలో—ఏమిటీ—

వ. రా : ఒంట్లో బాగులేదని టిఫిను ఏమిటయ్యా ?

అ. గో : అందుకే మరి 'ఒఖదోసె' అన్నారు !

చంద్రి : ఒంట్లో బాగులేకపోతే ఏమీ తినకండి కవిగారూ—

అ. రా : అవునమ్మా—'లంఘనం పరమౌషధం' అన్నారు. ఏమిటీ— అందులోకి నువ్వుకూడా చెబుతున్నావు. నాకేం వొద్దండీ— ఓన్లీ కాఫీ ! ఏమిటీ—

వ. రా : సరే, అందరికీ తీసుకురా. ఇంద. (నోటు ఇస్తాడు)

అ. వై. ఎప్పుడు తెచ్చినా ఐస్ కాఫీ తెస్తావురా బాబూ నువ్వు. వేడిగా తీసుకురా.

పెరు : బాగుందండయ్యా—హోటలు ఎక్కడుందండీ—అక్కడకెళ్ళి రావొద్దేటి ? మనకి అదేటో—అ పలాస్కూ, గిలాస్కూ అదేదో...అదిలేదు. కొనమంటే అయ్యగారు కొనరు. మరి, కెటిల్‌లో తెస్తే చల్లగా ఐపోదేటండి ?

వ. రా : వూఁ వూఁ—అరిక్సా కాడున్నాడుగా. అందులో నే వెళ్ళిరా. ఎండెట్లాగూ ఎంది. వెళ్లు ! (పెరుమాళ్లు లోపలకు వెళ్ళబోతాడు)

అ. గో : అ రాముంగారి కేంకేతావురా !

పెరు : మందేసి, అదేటీ—పట్టీయేసేవండీ. కుర్చీలో అలాకూచుని కళ్లుమూసుకున్నారు. (లోపలకు పోతాడు)

వ. రా : కాఫీవస్తోంది, రిహార్సల్సు మొదలెడదామా ?

అ. వై : అబ్బ ! [పెరుమాళ్లు కెటిల్‌తో వీధిలోకి వెళ్ళిపోతాడు]

అ. గో : బాధే ?—

అ. వై : తలనొప్పి బాధకాదు గానండీ—ఆలోచిస్తూ వుంటే ఈ రకంగా వేషాలతో నాటకం రిహార్సల్సు జరగ వనిపిస్తోంది.

వ. రా : అంటే ?

అ. వై : నేనా విలన్ వేషం వేసి, అంత ప్రౌఢంగా చంద్రికతో యాక్టు చెయ్యలేను సుమండీ !

చంద్రి : అవునండీ—నాకూ అదేబాధ ! ఆయన్ని పట్టుకుని అ తిట్లూ ఈ తిట్లూ తిట్టటం, కొట్టటం—అబ్బ !

అ. రా : యాక్టింగ్ కదమ్మా చంద్రికా—అంతకన్నా ఏముంది ?

చం : ఏమిటో చాలా కష్టం సుమండీ. (లేచి లోపలకుపోతూ) అ లోపల రూములో కాస్సేపు రెస్టుతీసుకుంటాను. కాఫీ రానివ్వండి ! (వెళ్ళిపోతుంది)

అ. వై. అబ్బ—చాలా బాధపడుతోందండీ పాపం ! నన్ను తిట్టే సీన్లూ అవీ తీసేసే ఏర్పాటు ఏమన్నా చెయ్యండి వీలైతే. ఐనా నేను తప్పచెప్పి చూస్తాను. (పోతాడు)

[ముగ్గురూ అటేచూసి, తర్వాత ఒకరిమొహం ఒకరు చూసుకుంటారు.]

అ. రా : కథకి బ్రహ్మాండమైన ట్విస్టు వచ్చిందిప్పుడు—ఏమిటీ—

వ. రా : ధ ధ ధా...'తెల్లారితే నాటకం, ఇది ఫైనల్ రిహార్సలా !' అయ్యబాబోయ్—కొంచెంకూడా జ్ఞానంలేదేమిటి చెప్మా ! పైగా డబ్బు పుచ్చుకుంటున్నారు గానీ—వట్టినే యాక్టుచెయ్యటం లేదుగదా. గట్టిగా ఏమన్నా అంటే ఏం గొడవ అవుతుందో అని ఎంత సర్దుకుపోతున్నా ఒఖలాగే వుంది.

అ. రా : అ సీను తీసెయ్యమంటాడు—ఈ డైలాగు లాగెయ్యమంటాడు ! ఏమిటో — ఏమిటనుకున్నాడో ! పెధవది—తిక్కీ డ్రామాస్ రాశాను నేను—నలభైఐదు నాటకాలు ! ఒక్కడు నాచాత అక్షరం మార్పించలేకపోయాడు. ఏమిటీ—ఇవాళ వీడెవడో—

అ. గో : అఁ—మార్చమంటే మార్చేస్తారా ఏమిటి ? అంతా వీళ్ల ఇష్టమే.

వ. రా : అవునండీ—ఇన్నాళ్లూ తెలియలేదా ఏమిటి ఈ గొడవ ?

అ. గో : తెలియలేదంటే, ఎప్పుడు మనం పూర్తిగా రిహార్సల్సు వేశాం చెప్పండి ! ఏదో తర్వాత చేస్తాం తర్వాత చేస్తాం అంటూ వచ్చాముగాని—అసలు విషయం ఎవరూ చెప్పలేదు. ఈ ప్రేమగొడవలూ ఇవీ ఇవాళకదా బయటపడ్డాయి ! (అటూ ఇటూ పచారు చెయ్యటం మొదలెడతాడు)

వ. రా : తెల్లారితే నాటకమయ్యా—గోపాలంగారూ !

అ. గో : అదే, అదే ఆలోచిస్తున్నాను.

వ. రా : ధ ధ...నాటకాలాడించేవాడి జన్మ జన్మరా బాబూ ! భగవంతుడా — ఏంచేస్తావో — (పైకిచూసి దణ్ణంపెట్టి, గోపాలంతో సమానంగా తనూ పచారు మొదలెడతాడు.)

అ. రా : ఈ సమస్య పరిష్కారం చిత్రంగా వుంది. [పచారు చేస్తున్నవాళ్ళిద్దరూ ఆ చివరివరకూ వెళ్ళి, తిరిగి రాబో తున్నప్పుడు, తనూ వాళ్లకు అభిముఖంగా వాళ్ళ మధ్యనుంచి పచారు మొదలెడతారు. కొంతసేపు అట్లా తిరిగాక, తక్కువ ఆగి మధ్యకివచ్చి నించుంటాడు.]

అ. రా : ఆగండి ! (వాళ్లు ఆగుతారు) దగ్గరకు రండి. (నెమ్మదిగా వచ్చి ఇద్దరూ చెరోపక్కా నించుంటారు) ఏమిటిస్తారు నాకు ?

వి. రా : ఏమిటిప్పుడం ? కాఫీకి వెళ్లాడుగా-రాగానే ఇస్తాడు.

అ. రా : ప్చ్...అదికాదండీ. ఈ సమస్య పరిష్కారం చేశాను : బ్రహ్మాండమయిన ఐడియా తట్టింది. ఇటువంటి అటువంటి ఐడియాకాదు !

అ. గో : ఏమిటది ?

అ. రా : అది చెబితేనే ఏమిటిస్తారని అడుగుతున్నాను.

వ. రా : చెబుదురూ—అన్నింటికీ మీకు లంచమే !

అ. రా : లంచం ఏమిటండీ - నా మేధాశక్తికి పారితోషికం అన్న మాట ! ఏమిటీ—

అ. గో : అలాగేలెండి-చెప్పండి.

అ. రా : ఏమిటంటే, ఈ రసికజన మనోభిరాముంచాత హీరోవేషం, ఈ అరిచేతిలోవైకుంఠంచాత విలన్‌వేషం వేయించటం వల్లనే ఈ చిక్కులొచ్చిపడ్డాయి. వైకుంఠమే హీరోఐ, రాముమే విలనయితే—ఏమిటీ ?...

వ. రా : (పొంగిపోయి) శాబాష్ ! (తగ్గి) కాని తెల్లారితేనాటకం కదా, ఇపుడెట్లా మారుస్తాం వేషాలు ?

